

పెదబయలులో భారీ వర్షం

- నేలకొరిగిన చెట్లు

ప్రజాశక్తి - పెదబయలు : మండలంలోని సీతగుంట పంచాయతీలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. పెదబయలు మెయిన్ రోడ్డు పై చెట్ల కొమ్మలు నెల కొరిగాయి. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. స్థానిక ఎస్ఐ పులి మనోజకుమార్ స్పందించి నెల కొరిగిన చెట్ల కొమ్మలను తొలగించారు.



రోడ్డుపై కూలిన చెట్టు

అడ్డాకులకు గిట్టుబాటుధర ఏదీ?

- కొనుగోలు చేయని జిసిసి

-తక్కువ ధరకు వ్యాపారులకు విక్రయం - నష్టపోతున్న గిరిజనులు



ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో సీజనల్ వారీగా గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులను జిసిసి కొనుగోలు చేయలేదు. దీంతో, మైదాన ప్రాంత వ్యాపారులు అటవీ ఉత్పత్తులను తక్కువ ధరకు కొనుగోలు చేసి తరలించుకుపోతున్నారు. గిరిజనులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.గిరిజనులు సేకరిస్తున్న అడ్డకులను జిసిసి కొనుగోలు చేయకపోవడంతో మైదాన ప్రాంత వ్యాపారులు, మధ్యవర్తి దళారులు కుమ్మక్కై బెట్టు కాటాలతో వారికి నచ్చిన ధరతో కొనుగోలు చేస్తూ మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. సరైన గిట్టుబాటు ధర లేక అడ్డాకులు సేకరించిన గిరిజనులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

గతంలో అడ్డాకులను జిసిసి కొనుగోలు చేసేది. దీంతో అడ్డాకులు సేకరించిన గిరిజనులకు గిట్టుబాటు ధర వచ్చేది. అయితే గత కొన్నేళ్ల నుంచి జిసిసి కొనుగోలు చేయకపోవడంతో మైదాన ప్రాంత వ్యాపారులు వారపు సంతలోకి వచ్చి వారికి నచ్చిన విధంగా ధరతో కొనుగోలు చేస్తూ మైదాన ప్రాంతాలకు తరలిస్తూ లాభార్జన చేసుకుంటున్నారు. అడ్డాకులను జి సిసి కొనుగోలు చేయాలని, గిరిజనులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు.

వేసవికాలంలో గిరిజన ప్రాంతంలో గిరిజనులు అడ్డాకులను సేకరిస్తుంటారు. ఎటువంటి వ్యవసాయ పనులు లేని సమయంలో వేసవిలో గిరిజనులు అడ్డాకులను సేకరిస్తుంటారు. వారానికి ఆరు రోజులపాటు అడ్డాకులను అటవీ ప్రాంతంలోకెళ్లి సేకరించి, అడ్డాకులను చిన్న చిన్న కట్టలుగా కట్టి, వారం రోజులపాటు ఎండబెట్టి ఆ తర్వాత విక్రయించే సమయంలో అడ్డాకులను పెద్ద కట్టలుగా కట్టి తరలించి వారపు సంతల్లో విక్రయిస్తుంటారు. సరైన గిట్టుబాటు ధర లేక వారం రోజులపాటు కష్టపడిన కష్టానికి తగిన ప్రతిఫలం రాకపోవడంతో అడ్డాకులు సేకరించిన గిరిజనులు గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

శుక్రవారం అరుకు వారపు సంతలో 40 కేజీల పెద్ద కట్ట దిండిను రూ.600 నుంచి రూ.700 వరకు మైదాన ప్రాంత వ్యాపారులు కొనుగోలు చేశారు. దీంతో వారం రోజుల పాటు కష్టపడిన కష్టానికి తగిన ప్రతిఫలం రాలేదంటూ అడ్డాకులు సేకరించిన గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డాకులను జీసిసి కొనుగోలు చేయాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడంతో మైదాన ప్రాంత వ్యాపారులు, మధ్యవర్తి దళారులు బెట్టు కాటాలతో మోసం చేస్తూ వారికి నచ్చిన విధంగా ధరతో కొనుగోలు చేస్తూ అమాయక గిరిజనుల కష్టాన్ని దోచుకుంటున్నారు. దూర ప్రాంతం నుంచి వారపు సంతలకు తరలించడానికి లగేజ్ చార్జీలు కూడా అధికంగా అవుతుందని వాపోతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అడ్డాకులను జిసిసి కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.



వ్యానులో అడ్డాకులను మైదాన ప్రాంతానికి తరలిస్తున్న వ్యాపారులు

ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టండి

తహశీల్దార్‌ను కోరిన ఎంపిపి లక్ష్మి, సిపిఎం నేతలు



తహశీల్దార్‌కు సమస్యలను విన్నవిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- విఆర్.పురం: వరదముంపు ప్రభావిత గ్రామాల్లో బాధితులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు పూనం సత్యనారాయణ కోరారు. శుక్రవారం ఎంపిపి లక్ష్మి ఆధ్వర్యంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం.సత్యనారాయణ మండల కార్యదర్శి సోయం. చిన్నబాబు, ఇతర నేతలు బృందంగా వెళ్లి తహశీల్దార్‌ను కలిసారు. సమస్యలపై విన్నవించారు. ముంపుబాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించే క్రమంలో రేఖపల్లి తరలించేవారికి షెల్టర్లు, తాగునీరు, సోలార్‌లైట్లు, పడవలు వంటి చర్యలు చేపట్టాలని కోరారు. గుట్టలపై గుడారాలు వేసుకున్న వారికి కిరోసిన్, బరకాలు, ముందుస్తుగా రేషన్, ఇతర నిత్యావసర సరుకులు అందజేయాలని కోరారు. బాధితులకు అసౌకర్యం లేకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి, ఇతర సిపిఎం నేతలు మాట్లాడుతూ, కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్న నేపథ్యంలో అధికారులు ప్రజాస్వామ్యయుతంగా పనిచేసి, సమస్యలను పరిష్కరించాలని కోరారు. మండలంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులంతా సహకరించాలని కోరారు. దీనిపై తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ స్పందిస్తూ, మండల అభివృద్ధికి కచ్చితంగా అందరం సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం మండల నాయకులు కారం సుందరయ్య, తాతబాబు, గుండెపూడి. లక్ష్మణరావు, కమ్మచిచ్చు. సత్యనారాయణ, కుంజా కన్నయ్య, పాల్గొన్నారు.

ఉపాధ్యాయున్ని నియమించాలని ధర్నా

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని పిన్నకోట, గుమ్మ పంచాయతీ మారుమూల గ్రామాలైన కొట్టేంగుడ, గొప్పిలపాలెం, కడరేవు, కళ్యాణగుమ్మి గ్రామాలకు ఉపాధ్యాయులను నియమించాలని వినూత్న రీతిలో గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజారావు, విజయకుమార్, ఆర్.రాజారావులు మాట్లాడుతూ, తమ రెండు పంచాయతీ పరిధి గ్రామాలకు 15 సవత్సరల నుండి ప్రభుత్వం ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయలేదన్నారు. 5 నుండి 10 సంవత్సరాలు నిండిన 38 మంది ఉన్నారనీ విద్యా బోధనలు లేక నిరక్షరాసులుగా మిగిలి పోయారన్నారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం చింతపుడి పాఠశాలకు వెళ్లాలంటే సుమారు మూడు కిల్లో మీటర్లు దూరం ఉందన్నారు. అనంతగిరి గుమ్మ పంచాయతీ కర్రిగొడ పాఠశాలకు కొండకోనల నడమ మూడు కిల్లో మీటర్లు దూరం ప్రయాణం చేయాల్సి ఉందన్నారు. వర్షా కాలంలో గెడ్డలు దాటి వెల్లలేని పరిస్థితిలో చదువుకు దూరం మవుతున్నారని, ఇప్పటి కైన ప్రభుత్వం తక్షణమే ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు మామిడి విజయ్ కుమార్, కొర్ర భీమన్న, రాపా రాజారావు, పి.రాజారావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఎస్ఇబి కానిస్టేబుల్‌కు అవార్డు

ప్రజాశక్తి -రంపచోడవరం : స్థానిక ఎస్ఇబి స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బివి రమణకు ఉత్తమ ఫీల్డ్ స్టాఫ్ రోలింగ్ ట్రోఫీ అవార్డు దక్కింది. మంగళగిరిలో ఎస్ఇబి కమిషనర్ చేతుల మీదుగా రమణ అవార్డును స్వీకరించారు. విశాఖపట్నం జోన్ పరిధిలో ఉన్న రంపచోడవరం స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న బివి రమణకు ఈ అవార్డు రావడం అభినందనీయ మన్నారు. రంపచోడవరం స్టేషన్‌కు గర్వ కారణంగా అవార్డు స్వీకరించిన రమణను సెబ్ సిఐ ఇంద్రజిత్‌తోపాటు స్థానిక స్టేషన్ సిబ్బంది అభినందించారు.



ఫీల్డ్ స్టాఫ్ రోలింగ్ ట్రోఫీ స్వీకరిస్తున్న రమణ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత

మోదకొండమ్మ జాతరను జయప్రదం చేయాలి

-జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత

ప్రజాశక్తి -పాడేరు : ఈనెల 9,10, 11 తేదీలలో నిర్వహించనున్న గిరిజన ఆరాధ్య దైవం మోదకొండమ్మ జాతరను విజవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదేశించారు. అమ్మవారి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేసారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేసి జాతరను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. అమ్మవారి ఘటాలు శతకంపట్టుకు తరలింపు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణ, పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలు, రవాణా, విద్యుత్తు సదుపాయాలు, భోజన వసతి, వైద్య సేవలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. తాగునీటి సమస్య లేకుండా మంచి నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేయాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు సూచించారు. క్లోరినేషన్ చేసిన మంచినీటిని సరఫరా చేయాలని చెప్పారు. జాతర సంధ్భంగా అదనపు సిబ్బందిని నియమించి మెరుగైన పారిశుధ్య పనులు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించారు. తగినన్ని బస్సులను నడపాలని ఆర్టీసి అధికారులకు చెప్పారు. జాతర సమయంలో భారీ వాహనాల రాకపోకలను ఘాట్ రోడ్ లో నిషేదించామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేసారు. నాలుగైదు రోజులు భారీ వాహనాలను అనుమతించ వద్దని పోలీసు, రహదారులు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రైవేటు వాహనాలు పరిమితికి మించి రవాణా చేయకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 750 మంది పోలీసులతో బంధోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆలయం వద్ద, శతకం పట్టు, సినిమాహాలు సెంటర్లలో పబ్లిక్ అడ్రెస్ సిస్టం ఏర్పాటు చేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

అదనపు ఎస్పీ ధీరజ్ మాట్లాడుతూ, ఉత్సవాలకు వచ్చే భక్తుల వాహనాలకు మూడు ప్రదేశాలలో పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విశాపట్నం నుండి పచ్చే వాహనాలకు స్థానిక ఎంపిడిఓ కార్యాలయం సమీపం, చింతపల్లి, జి.మాడుగుల మార్గంలో వచ్చే వాహనాలకు స్థానిక సెయింట్ ఎన్స్ స్కూలు, అరకు వ్యాలీ, పెదబయలు మార్గంలో వచ్చే వాహనాలకు తలారిసింగిలోని పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసామన్నారు.ఈ సమావేశంలో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్, సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, డి. ఆర్.ఓ పద్మావతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ భాషా, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్ర, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డి.వి.ఆర్.ఎం. రాజు, డి.డి.ఐ. కొండలరావు, జిల్లా పంచాయితీ అధికారి కొండలరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పి. ఎస్.కుమార్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ లీలా కుమార్, రహదారులు భవనాల శాఖ ఇఇ బాల సుందర బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్ష కె.రామారావు, సెక్రటరీలు టి.ప్రసాద నాయుడు, శ్రీను, రమణ పాల్గొన్నారు.

ఆ వృద్ధురాలు.. మృత్యుంజయురాలు

- చెట్టు కూలడంతో నేటమట్టమైన ఇల్లు
- కరెంట్ పోవడంతో కొవ్వొత్తి కోసం వెళ్లి ప్రాణాలను దక్కించుకున్న మహిళ
- బాధితురాలికి డాక్టర్ జమాల్‌ఖాన్ చేయూత

ప్రజాశక్తి- ఎటపాక : మండలంలోని గౌరీదేవిపేటకు చెందిన అమరవరపు కుసుమ అనే వృద్ధురాలు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. గురువారం రాత్రి ఈదురుగాలులతోపాటు భారీ వర్షం కురవగా, వాటి దెబ్బకు భారీ వృక్షం వృద్ధురాలి ఇంటిపై పడడంతో ఇల్లుమొత్తం నేలమట్టమైంది. అయితే ఆ సమయంలో ఆమె ఇంట్లో లేకపోవడంతో ప్రాణాలతో బయటపడింది. ఈదురుగాలులు వీచే సమయంలో కరెంట్ పోవడంతో, ఇంట్లో దీపపు బుడ్డీ లేకపోవడంతో కొవొత్తులు తెచ్చుకునేందుకు పక్కనే ఉన్న కిరాణా దుకాణానికి వెళ్లింది. ఆ సమయంలో ఆమె ఇంటిపై భారీ చెట్టుకూలి, ఇళ్లంతా నేలమట్టమైనా, ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడింది. అయితే ఈ ఘటనతో వృద్ధురాలు కుసుమ నిలువ నీడ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

డాక్టర్ జమాల్‌ఖాన్ ట్రస్ట్ చేయూత

ఈదురుగాలులకు ఇంటిపై చెట్టుకూలడంతో వృద్ధురాలు కుసుమ నిరాశ్రయురాలైందన్న విషయం తెలుసుకున్న ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్ శుక్రవారం గౌరీదేవిపేట, బిసి కాలనీలోని బాధితురాలిని పరామర్శించారు. మనోధైర్యాన్ని చెప్పి, తనవంతు తక్షణ సాయంగా జెకెసిటి ట్రస్ట్ ద్వారా రూ.ఐదు వేలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ జమాల్‌ఖాన్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు తమ ట్రస్ట్‌ద్వారా పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారుఉ. బాధితులు మనోధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. తనకు తోచిన సాయాన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు.

అనంతరం వృద్ధురాలి ఇంటి నిర్మాణానికి అవసరమైన రేకులు, ఇనుప పైపులు, సిమెంట్‌ను తమ ట్రస్ట్ ద్వారా సమకూరుస్తామని హామీనిచ్చారు. బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెకెసిటి సభ్యులు ఎస్‌కె షాజహాన్, ఎస్‌కె.రియాజ్, ఇంతియాజ్, నటరాజ్, అమరవరపు నారాయణ, రాము, నరేడ్ల సత్యనారాయణ, కొవ్వూరు ఇంద్రమ్మ, గొల్లపల్లి కష్ణవేణి, చిలకల ఈశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బాధితురాలికి నగదు సాయం అందిస్తున్న డాక్టర్ జమాల్‌ఖాన్

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎఒ ఉమాదేవి

ప్రజాశక్తి- కొయ్యూరు : పచ్చిరొట్ట విత్తనాల సాగుతో భూమి సారవంతం అవుతుందని కొయ్యూరు మండల వ్యవసాయాధికారి డి.ఉమాదేవి అన్నారు. శుక్రవారం. మండలంలోని చీడిపాలెం రైతు భరోసా కేంద్రంలో రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ప్రస్తుతం జనుము, జీలుగ పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, సగం ధరకే వాటిని పొందవచ్చున్నారు. వీటిని వరిసాగు చేసే పొలాల్లో వేసి, ఖరీఫ్‌లో దమ్ముల్లో వీటిని కలియదున్నడం ద్వారా భూమి సారవంతమౌతుందని, నత్రజని ఎరువులు (యూరియా) వినియోగం తగ్గి, ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పొందవచ్చున్నారు. ఖరీఫ్ సీజనుకు ముందుగా రైతులు తమ పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకోవాలని సూచించారు. 10 కేజీల విత్తనాలను రూ.88కే లభిస్తాయన్నారు.


పాఠశాలల్లో దోమల నివారిణి పిచికారీ

ప్రజాశక్తి- విఆర్ పురం: రేఖపల్లి పిహెచ్‌సి వైద్యబృందం ఆధ్వర్యంలో మండలంలోని పలుపాఠశాలల్లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నారు శుక్రవారం మండలంలోని రేఖపల్లి కస్తూరిబా పాఠశాల హాస్టల్, విఆర్ పురం పాఠశాలల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ నెల 12ను పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా హాస్టల్స్, పాఠశాలల్లో విద్యార్థులకు దోమల బెడద లేకుండా చర్యలు చేపట్టడంతోపాటు దోమల ద్వారా సంక్రమించే వ్యాధులు రాకుండా చేసే చర్యల్లో భాగంగా వీటిని పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. సీజనల్ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకుఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడుతున్నట్లు వైద్యసిబ్బంది వెల్లడించారు.



దోమల నివారణి పిచికారీ చేయిస్తున్న వైద్యసిబ్బంది

టిడిపి విజయోత్సవాలు



ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సందడి చేస్తున్న టిడిపి నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి- రంపచోడవరం : రంపచోడవరం నియోజకవర్గంలో కూటమి బలపరిచిన టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీషాదేవి ఘన విజయం సాధించడంతో టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. శుక్రవారం మాజీ సర్పంచ్ వై.నిరంజని దేవి ఆధ్వర్యంలో స్థానిక వాల్మీకి పేట నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పులమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కేకును కట్‌చేసి సంబరాలు జరుపుకోవడంతోపాటు, ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

కొయ్యూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

- అందుబాటులో ఎంపిసి, సిఇసిలో చెరో 40 సీట్లు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండల కేంద్రమైన కొయ్యూరులో కొత్తగా మంజూరైన జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాంబాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో తాత్కాలికంగా దీన్ని నిర్వహించనున్నారు. 2024.-25 విద్యాసంవత్సరానికి ఇంటర్ ఫస్టియర్ ఎంపిసి గ్రూపులో 40సీట్లు, సిఇసి గ్రూపులో 40సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఇంటర్ చదవాలనుకున్న విద్యార్థులు ప్రవేశం పొందవచ్చని, వెంటనే కొత్తగా మంజూరైన జూనియర్ కాలేజీని సంప్రదించాలని సూచించారు. కొత్తగా మంజూరైన జూనియర్ కాలేజీలో ప్రవేశం పొందే విద్యార్థులకు ఎటువంటి ఫీజులు ఉండవని, నాణ్యమైన ఉచిత విద్యను అందించడంతోపాటు ప్రభుత్వ పథకాలన్నీ విద్యార్థులకు వర్తిస్తాయన్నారు.

రేపు సిరిగిందలపాడులో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి -రంపచోడవరం : రాజమండ్రికి చెందిన రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో మండలంలోని సిరిగిందలపాడులో ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యశాలకు చెందిన స్వామి పరిజ్ఞేయానంద తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గుండెకు సంబంధించిన వ్యాధులు, ఆయాసం, గుండె దడ, బి.పి.,షుగరు, చెవి, ముక్కు, గొంతు, ఎముకలు, కీళ్లు, ఫిట్స్, చర్మ వ్యాధులతో పాటు మహిళలు, చిన్నపిల్లల వ్యాధులకు, సామాన్య జ్వరాలకు వైద్యనిపుణులు సేవలు అందిస్తారన్నారు. అవసరమైతే వైద్యులు సూచన మేరకు ఇసిజి, ఎక్స్‌రే, రక్తపరీక్షలు, ఫిజియోథెరపీ నామమాత్రపు రుసుముతో చేస్తారన్నారు. అలాగే వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ ఆధ్వర్యంలో రోగులకు కంటివైద్యపరీక్షలు నిర్వహించి, కంటి అవసరమైనవారికి కంటిఆపరేషన్లు ఉచితంగా చేస్తామన్నారు. కళ్లద్దాలను ఉచితంగా ఇస్తామని, వైద్యశిబిరానికి వచ్చే రోగులు ఆధార్, తెల్లరేషన్‌కార్డుతో రావాలని సూచించారు.

రక్తదానం చేయండి : సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి

ప్రజాశక్తి -పాడేరు : పాడేరు పట్టణంలో రక్తదానం చేయడానికి దాతలు ముందుకు రావాలని పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అత్యవసర సమయంలో రక్తం లభించక అనేకమంది ప్రాణాలు కోల్పోతున్న విషయం దృష్టిలో పెట్టుకుని ఈ నెల 9,10,11 తేదీల్లో జరగనున్న మోదకొండమ్మ పండుగ సమయంలో పాడేరు సబ్ కలెక్టర్ ప్రాంగణంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. రక్తం కొరత సమస్య పరిష్కారంకై రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె వివరించారు.

పరీక్షల విభాగాన్ని పరిశీలించిన రిజిస్ట్రార్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం పరీక్షల విభాగాన్ని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. పరీక్షల విభాగంలోని పలు విభాగాలను ప్రత్యక్షంగా పరిశీలించి, సర్టిఫికెట్ల జారీ, సిబ్బంది విధుల నిర్వహిస్తున్న విధానం తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నూతనంగా అభివృద్ధిచేసిన టాయిలెట్స్ బ్లాక్‌ను ప్రారంభించి, పరిశీలించారు. రిజిస్ట్రార్ వెంట డిప్యూటీ రిజిస్ట్రార్ సాంబమూర్తి పాల్గొన్నారు.



చిత్రకళా ప్రదర్శనను తిలకిస్తున్న ఎయు రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ విద్యార్థుల చిత్రకళ ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం చిత్రకళ విభాగంలో బిఎఫ్ఎ, ఎంఎఫ్ఎ చివరి సంవత్సరం విద్యార్థులు తమ కోర్సులో భాగంగా తయారుచేసిన వివిధ చిత్రాలు, శిల్పాలతో ఏర్పాటుచేసిన చిత్ర కళాప్రదర్శనను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ శుక్రవారం ప్రారంభించారు. శివాజీపాలెంలోని ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఏర్పాటుచేసిన ప్రదర్శనను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తిలకించారు. ఎంతో సృజనాత్మకంగా ఆలోచిస్తూ వైవిధ్యమైన మాధ్యమాలను ఉపయోగించి చిత్రాలను తయారుచేసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, విభాగాధిపతి సింహాచలం, పూర్వ ఆచార్యులు ఆచార్య వి.రమేష్, ఆచార్య మహేశ్వర దాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఏకరువు

ప్రజాశక్తి -అనకాపల్లి డెస్క్: రావికమతం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పైలరాజు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. మూడు, నాలుగు, ఐదు తరగతులను జంబ్లింగ్ పద్ధతిలో మత్స్యవానిపాలెం పాఠశాలలో విలీనం చేయడంతో పిల్లలను దొండపూడి పాఠశాలకు తరలించడంతో పిల్లలు మెయిన్ రోడ్డు దాటి వెళ్లడంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని సర్పంచ్ ఎం.గణేష్ తెలిపారు. మత్స్యవానిపాలెం గ్రామంలోనే మూడు, నాలుగు, ఐదు తరగతులను ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని సర్పంచ్ మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ దృష్టికి తీసుకెళ్లారు. ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేసుకున్నప్పటికీ బిల్లులు ఇవ్వలేదని పొన్నవోలు సర్పంచ్ విరోధి రాజారావు, తదితరులు హౌసింగ్ ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. బాల్య వివాహాలు జరగకుండా అందరూ సహకరించాలని ఐసిడిఎస్ సిడిపిఒ ఉషారాణి తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం వివరాలు ప్రతినెలా సర్పంచ్, ఎంపీటీసీలకు అందజేయాలని వైస్ ఎంపీపీ దంట్ల రమణ సిడిపిఒ దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ సమస్యలపై ఆ శాఖ అధికారులకు ఫోన్ చేసినా స్పందించ లేదని ఏఈ నందనను కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి, గొంప ఎంపిటిసి సూర్యనారాయణ, కొత్తకోట ఎంపిటిసి పూడి దేవాలు నిలదీశారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు



డుంబ్రిగుడలో బహుమతులు అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గత నెల 15 నుంచి స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయంలో ప్రారంభించిన వేసవిజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. మూడు వారాలపాటు విద్యార్థులు, చిన్నారులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించారు. ముగింపు రోజున స్థానిక ఎంపీడీవో చేతులమీదుగా చిన్నారులకు, విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు.

గత నెల 15 నుంచి ఈ శిబిరాలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులకు నిర్వహించారు. సెలవులు కావడంతో విద్యార్థులు ఉదయం 9 గంటల నుంచే గ్రంథాలయానికి చేరుకొని ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులకు పలు రకాల పుస్తకాలపై అవగాహన కల్పించడంతో పాటు కథల పోటీలు, వ్యాసరచన, క్విజ్, రన్నింగ్, డాన్స్, ఖో ఖో ఆటలతో పాటు పలు ఆటల పోటీలను నిర్వహించారు. రోజు వారీగా ఒక్కొక్క ఆటల పోటీలను నిర్వహిస్తుండటంతో విద్యార్థులు, చిన్నారులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పలువురు అధికారులు, రాజకీయ నాయకులు గ్రంధాలయాలతో లాభాలపై విద్యార్థులకు పలు రకాలుగా అవగాహన కల్పించారు. వేసవి సెలవుల్లో విజ్ఞాన శిబిరాలను నిర్వహించి విజ్ఞానం, ఆటల పోటీలు ఏర్పాటు చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని ఎస్ సునీత ఉపాధ్యాయులు సింహాద్రి సిబ్బంది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: విద్యార్థులు విద్యతో పాటు డిబేట్, డ్రాయింగ్, క్రీడలు, రంగవల్లులు, యోగా, మార్షల్ ఆర్ట్స్, వంటి అన్ని రంగాలలో రాణించాలని మండల విద్యాశాఖ అధికారి పనసల ప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి సూర్యనారాయణ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ముగిపు కార్యక్రమానికి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవింద్ ప్రసంగించారు. అనంతరం వివిధ పోటీలు, క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బాల్య దశ నుంచే పిల్లలు విద్యతో పాటు వివిధ రంగాలలో నైపుణ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థి దశలోనే మంచి రంగాన్ని ఎంచుకొని స్థిరపడేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చింతపల్లిలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అతిథులు

విదేశీ విద్యార్థులు 'గీతం రాయబారులు'

ప్రత్యేక పట్టభద్రుల దినోత్సవంలో ప్రో విసి గౌతమ్‌రావు



ప్రత్యేక పట్టభద్రుల దినోత్సవంలో పట్టాలు అందుకున్న విదేశీ విద్యార్థులు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో స్టడీ ఇండియా కార్యక్రమం ద్వారా ప్రవేశాలు పొందిన వివిధ దేశాల విద్యార్థులను అంతర్జాతీయంగా గీతం పేరు ప్రఖ్యాతులను విస్తరింప చేసే గీతం రాయబారులుగా పరిగణిస్తామని విశ్వవిద్యాలయం గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు పేర్కొన్నారు. గీతంలో వివిధ కోర్సులు విజయవంతంగా పూర్తి చేసుకుని స్వదేశాలకు తిరిగి వెళుతున్న విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పట్టభద్రుల కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్యార్థుల కోసం ప్రణాళికాయతంగా చర్యలు తీసుకుంటోందని, చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల ద్వారా తీర్చిదిద్దుతోందని చెప్పారు. విద్యార్థులు దేశానికి, సమాజానికి ఉపయోగపడేలా తమ మేధస్సును ఉపయోగించాలని పిలుపునిచ్చారు. స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్య, పరిశోధనల ద్వారా తమ దేశాలకు ప్రయోజనం కలిగించే మానవ వనరులుగా మారాలని కోరారు. గీతం అంతర్జాతీయ విద్యా వ్యవహారాల విభాగం డైరక్టర్ కెపిసి.కిషన్ మాట్లాడుతూ 25 దేశాలకు చెందిన 400 మంది విదేశీ విద్యార్థులు గీతం విశాఖ, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది గీతం విశాఖ ప్రాంగణం నుంచి 51 మంది విదేశీ విద్యార్థులు ఇంజనీరింగ్, ఫార్మశీ, లా, సైన్స్, పారామెడికల్ కోర్సులతో పాటు మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసుకున్నారని తెలిపారు. కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో గీతం న్యాయ కళాశాల డైరక్టర్ ప్రొఫెసర్ అనితారావు, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేదవతి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశన్ బాలు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి

- మునగపాకలో రైతు, సింహాచలంలో లైన్‌మ్యాన్

ప్రజాశక్తి- యంత్రాంగం

మునగపాక: మండలకేంద్రం మునగపాకకు చెందిన రైతు దాడి సంతోష అప్పారావు (36) విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం రోజువారి మాదిరిగానే శుక్రవారం ఉదయం తన తండ్రి శివతో కలిసి తమ కళ్లంలో పొలం పని చేసేందుకు సంతోష్ వెళ్లాడు. విద్యుత్ స్తంభం పక్కనే పశువుల గత్తం ఎత్తుతుండగా, విద్యుత్ స్తంభానికి ఆనుకొని సపోర్ట్ వైరును తాకడంతో సంతోష్ అప్పారావు షాకుకు గురయ్యాడు. విద్యుత్‌షాక్‌తో కొడుకు అపాస్మారక స్థితికి చేరుకున్న కొడుకును చూసి కిందపడిపోయిన తండ్రి శిణను సమీప రైతులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే సంతోష్ అప్పారావు మరణించాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడు సంతోష్ అప్పారావు కు భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మతుని భార్య హేమలత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. ప్రసాదరావు తెలిపారు.

గోపాలపట్నం : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సింహాచలం సమీపంలోని అప్పన్నపాలెంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... పులమరశెట్టి వెంకటరావు (47) జివిఎంసి 89వ వార్డు పరిధి కొత్తపాలెంలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. ఏపీఎస్పీబీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా చేరి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో జూనియర్ లైన్‌మ్యాన్‌గా ప్రమోషన్ పొందాడు. శుక్రవారం మధ్యాహ్నం అప్పన్నపాలెంలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మత్తు పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే వెంకటరావును స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే వెంకటరావు మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. వెంకటరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంకటరావు మృతివార్త విన్న కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. మృతుని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

డబ్బు కోసం బెదిరించిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో డబ్బు కోసం బెదిరించిన వ్యక్తిని పిఎం.పాలెం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నార్త్ జోన్ ఎసిపి సునీల్ తెలిపారు. స్టేషన్లో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జివిఎంసి 7వ వార్డు కారుషెడ్ ప్రాంతానికి చెందిన పోతిన వెంకటరావు (బాబు) తన భార్య, ఇద్దరు కుమారులుతో కలిసి నివాసముంటున్నారు. ఇతడు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. అతని భార్య చార్టర్డ్ అకౌంటెంట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ నెల 2వ తేదీ రాత్రి 9.30 గంటల సమయంలో గుర్తుతెలియని వాట్సాప్ నెంబర్ నుంచి వెంకటరావుకు ఓ మెసేజ్ వచ్చింది. అందులో 'మీ ఇద్దరు కుమారులలో ఒకరిని చంపేందుకు ఒక అసైన్మెంట్ వచ్చిందని, కావలిసిన డబ్బులు ఇవ్వకపోతే తన పని తాను చేస్తానని' మెసేజ్ సారాంశంగా ఉంది. దీంతో వారు భయపడి సదరు వాట్సాప్ నెంబర్‌ఖు బ్లాక్ చేసి 3, 4 తేదీల్లో కుటుంబం భయంతో బయటకు వెళ్లలేదు. 5వ తేదీ మధ్యాహ్నం సుమారు 1 గంటకు సదరు వాట్సాప్ నెంబర్‌ను అన్‌లాక్ చేయగగా మధ్యాహ్నం 1.35 గంటలకు అతనికి ఆ నంబర్ నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. కాల్ లిఫ్ట్ చేయగా ఎవరూ మాట్లాడలేదు. పిల్లవాడిని చంపకుండా ఉండాలంటే రూ.20 లక్షలు ఇవ్వాలని వాట్సాప్ మెసేజ్ వచ్చింది. భయపడిన వెంకటరావు రూ.5 లక్షలు గుర్తు తెలియని వ్యక్తికి ఇచ్చేందుకు అంగీకరించాడు. 6వ తేదీ ఉదయం 11 గంటలు వరకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అదే రోజు పిఎం పాలెంలోని సాంకేతిక కాలేజీ గేటు నెంబర్2 వద్ద డబ్బులు ఇవ్వాలని గుర్తు తెలియని వ్యక్తి సూచించాడు. దీనిపై వెంకటరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు సిఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక కాలేజీ గేటు నెంబర్-2 వద్దకు బాధితుడిని నగదుతో పంపి సిఐ సిబ్బందితో మాటు వేశారు. నిందితుడు డబ్బులు తీసుకోడానికి ఎపి 31బికె 4040 కారులో వచ్చాడు. డబ్బులు తీసుకోడానికి రాగా అప్పటికే మాటు వేసిన పోలీసులు పట్టుకున్నారు. నిందితుడుది అనకాపల్లి జిల్లా రాంబిల్లికి చెందిన శివకోటి నాగ వెంకట్ పవన్‌గా గుర్తించారు. కారు, నగదుతో పాటు ఓ కత్తి, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ప్రస్తుతం పిఎం.పాలెంలో నివాసం ఉంటునట్లు ఎసిపి తెలిపారు. నిందితునికి రూ.15 లక్షలు అప్పు ఉందని, అందుకే ఈ నేరం చేసినట్లు అంగీకారించాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ వై.రామకృష్ణ, ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.



దొండూ దొండే నాటకంలోని ఓ సన్నివేశం

అలరించిన నాటికలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ - కళాభారతి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శించిన దొండూ దొండే, మట్టి పరిమళం నాటికలు వీక్షకులను అలరించాయి. వీటిలో దొండూ దొండే చక్కని హాస్యాన్ని అందించింది. మట్టి పరిమళం ఆసాంతం ఆకట్టుకుంది. ప్రతి నెలా మొదటి శుక్రవారం ప్రదర్శించే నాటికల్లో భాగంగా వీటిని ప్రదర్శించినట్టు నిర్వాహకులు తెలిపారు. ముందుగా అకాడమీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాంబాబు గుమ్ములూరి, కోశాధికారి పైడా కృష్ణ ప్రసాద్, డైరెక్టర్ డేవిడ్ రాజు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ స్థానిక నాటక సంస్థలను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రమాణాల మేరకు ప్రదర్శనలకు సిద్ధపడి దరఖాస్తు చేసుకున్నట్లయితే స్క్రిప్ట్ పరిశీలించి బాగుంటే తప్పకుండా అవకాశమిస్తామన్నారు. ఈ నెల 23న ప్రముఖ రచయిత, సాహిత్యపరంగా ఎంతో సేవచేసిన డాక్టర్ రామవరపు శరత్‌బాబుకు 'సాహిత్య కళా భారతి' బిరుదుతో పురస్కారం అందజేయనున్నట్టు తెలిపారు.

ఎన్నికల్లో జర్నలిస్టుల సహకారం మరువలేనిది

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో జిల్లా యంత్రాంగానికి జర్నలిస్టులు ఎంతో సహకరించారని, పొరపాట్లు జరగకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారని, వారి సహకారం మరువలేనిదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. ఎన్నికల జాబితా రూపకల్పన, సవరణ ప్రక్రియకు సంబంధించి అనేక కథనాలు ప్రచురించటం ద్వారా పొరపాట్లను సవరించేలా యంత్రాంగానికి మార్గదర్శకం చేశారని అన్నారు. వివిధ మార్గాల్లో జిల్లా యంత్రాంగానికి సహకారం అందించిన మీడియా మిత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సజావుగా, విజయవంతంగా జరిగిన నేపథ్యంలో జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో కలెక్టరేట్ మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జర్నలిస్టులు అందించిన సహకారాన్ని, సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజానికి ఎన్నో విధాలుగా సేవలందిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి యంత్రాంగం తరపున అనేక విధాలుగా కృషి చేశామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. చాలా మందికి హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించామని, ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. సంజీవని నిధి ద్వారా అవసరమైన వారికి ఆర్థిక సాయం కూడా అందించామని గుర్తుచేశారు. ఇళ్ల స్థలాల జారీ ప్రక్రియకు సంబంధించి పలు సమావేశాలు నిర్వహించి సానుకూల నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. వారి సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని తెలిపారు. జూలై ఒకటో తారీఖు నుంచి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. జర్నలిస్టుతో పాటు వారి జీవిత భాగస్వామికి కూడా అవకాశం కల్పించనున్నామని స్పష్టం చేశారు. ఆగస్టు నుంచి జర్నలిస్టుల హెల్త్ స్కీంకు సంబంధించి ప్రీమియం రెన్యువల్ కూడా చేస్తామని పేర్కొన్నారు. నూతన ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ఇళ్ల స్థలాల మంజూరు ప్రక్రియకు సంబంధించి కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో మీడియా ప్రశంసనీయ పాత్ర పోషించిందని పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పేర్కొన్నారు. మీడియా కథనాలకు అనుగుణంగా అనేక చర్యలు చేపట్టామని గుర్తుచేశారు.

ఎయు వద్ద టిడిపి సంబరాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కూటమి విజయంతో ఆంధ్ర యూనివర్సిటీ ముఖద్వారం వద్ద టిడిపి ఆధ్వర్యంలో శుక్రవారం విజయోత్సవాలు నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్టాభిరామ్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి కూటమి విజయానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో విశ్వవిద్యాలయాలు వైసిపి కార్యాలయాలుగా మారాయన్నారు. ఎయులో రాజకీయ నాయకుల విగ్రహాలు తొలగించాలన్నారు.

వైసిపిలో అంతర్మథనం

పార్టీని దెబ్బతీసిన అంశాలపై విశాఖ నేతల్లో చర్చ

అధిష్టానం - కేడర్ మధ్య పెరిగిన అంతరంతోనే ఓటమి చెందామని పలువురి వ్యాఖ్య

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో


ఎన్నికల్లో ఓటమిపై వైసిపిలో అంతర్మథనం మొదలైంది. పార్టీని దెబ్బతీసిన అంశాలపై ఆ పార్టీ విశాఖ నేతలు సమీక్షించుకుంటున్నారు. 'రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ ప్రజలకు ఎంతో చేశాం. గెలిస్తే ఇంకా చేయాలనుకున్నాం. కానీ ఎలా జరిగిందో ? ఏం జరిగిందో ?. మొత్తానికి దెబ్బయిపోయాం. ఘోరపరాజయం పాలయ్యాం' అంటూ ఓటమి చెందిన నాయకులంతా ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు. ఓటమి తరువాత ఎక్కువ మంది నేతలు ఇళ్లకే పరిమితమైపోయారు. రాష్ట్రం, దేశంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను టీవీలు, ఫోన్ల ద్వారా తెలుసుకుంటూ ఎవరి అవగాహనకు వారొచ్చారు. కూటమి పార్టీలైన టిడిపి, జనసేన, బిజెపిలకు విశాఖలోని పలు సెగ్మెంట్లలో తమపై వచ్చిన మెజారిటీలపై ముఖ్యనేతలంతా తలలు పట్టుకుంటున్నారు. ఇంత వ్యతిరేకత ఉందా ? అంటూ ఆశ్చర్యానికి లోనవుతున్నారు. 'విశాఖ రాజధాని' అంశం ఉత్తరాంధ్ర ప్రాంతంలో తమను గట్టెక్కిస్తుందనుకున్న వారికి శృంగభంగమే ఎదురైంది. రుషికొండపై నిర్మాణాల విషయంలో కోర్టుల వరకూ వివాదం వెళ్లాక సైతం భవంతులను పూర్తిచేయడం ఒక శాపంగా మారిందా ? స్థానికంగా ఇది కూడా దెబ్బతీసిందా ? అన్న చర్చ సాగుతోంది.

పార్టీని నడిపేదెలా ?

ఓటమి ఎంత భయంకరంగా ఉంటుందో ప్రస్తుతం వైసిపి శ్రేణులు అనుభవం ద్వారా తెలుసుకుంటూ ఆవేదనకు గురవుతున్నాయి. మరో ఐదేళ్లపాటు పార్టీని ఎలా నడిపేది ? తామెలా ముందుకెళ్లేది ? అనే తీవ్ర ఆవేదనలో ఓటమి పాలైన నాయకులు, వార్డులు, గ్రామ స్థాయిల్లో ఉండే నాయకులు, కార్యకర్తలు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. ఈ విషయంపై కొంతమంది చేసిన తప్పులను గుర్తించి పై నుంచి దిగువ వరకూ సరిచేసుకోవాలని భావిస్తుండగా.. ఇంకేదో మోసం, కుట్ర జరిగిందంటూ వైసిపి అభిమానులు బాహాటంగా చెప్పుకోవడం కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో రెండో అంశాన్నే పట్టుకుని వేలాడితే భవిష్యత్తులో నష్టపోతామంటూ ఇంకొంతమంది ఆ పార్టీకి చెందిన సీనియర్లు అభిప్రాయపడడం వైసిపిలో తాజా పరిణామం.

నాడు గిర్రున తిరిగి...నేడు డీలా పడి..

2019లో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఫ్యాన్ గిర్రున తిరిగింది.



ఎక్కువ సీట్లు కొల్లగొట్టింది. 2024 ఎన్నికలో దాని రెక్కలు విరిగిపోయాయి. విశాఖ పార్లమెంట్ పరిధిలోని గత ఎన్నికల్లో గాజువాక, భీమిలి, శృంగవరపు కోట, విశాఖ ఎంపీ సీటును వైసిపి కైవశం చేసుకుంది. గ్రామీణ విశాఖ (ప్రస్తుత అనకాపల్లి, అల్లూరి జిల్లాలు)లో అన్ని సీట్లనూ గెలుచుకుంది. ఈ ఎన్నికల్లో సీన్ రివర్స్ అయింది. విశాఖ, అనకాపల్లిల్లో ఆ పార్టీ ఒక్క సీటునూ గెలవలేకపోయింది. అల్లూరి జిల్లాలో మాత్రం పాడేరు, అరకుల్లో వరుసగా గెలిచింది. ఏదేమైనా ఓటమి పరిణామాలన్నీ వైసిపిని ప్రస్తుతం కుంగదీస్తున్నాయి. సచివాలయాలు, వాలంటీర్లతో రాజకీయ పని అయిపోతుందనే భ్రమల్లో అధిష్టానం ఉండడం, గ్రామ, వార్డు, మండల స్థాయిల్లో నాయకులు, కార్యకర్తలకు పనిలేకుండా చేయడంతో 2024 ఎన్నికల యుద్ధంలో 'మూడు పార్టీల కూటమి' రాష్ట్రాన్ని ఎత్తుకుపోయిందంటూ వైసిపిలో చదువుకున్న యువత బాహాటంగా విశాఖలో చెప్పడం విశేషం. కేడర్‌ను కలుపుకుని పోయేలా కాకుండా వారిని పట్టించుకోకుండా సచివాలయాలు, వాలంటీర్లు, ఐప్యాక్ బృందాలపై ఆధారపడడం వల్లే ఈ స్థితి నెలకొందంటూ వీరు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వైసిపి నాయకుల ఇళ్లపై జరుగుతున్న దాడులపైనా జిల్లాల వారీగా వైసిపి అధిష్టానం లీగల్ సెల్, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల స్థాయి నాయకులతో న్యాయ కమిటీలను శుక్రవారం వేయడం విశేషం. ఇక కూటమి ప్రమాణ స్వీకారం 12న జరిగాక పరిణామాలు ఎలా ఉంటాయో అన్న అంచనాల్లో వైసిపి నేతలు తలమునకలై ఉన్నారు.

సెంట్రల్ బ్యాంక్ మహిళా బ్రాంచి ప్రారంభం



బ్రాంచిని ప్రారంభిస్తున్న డాక్టర్ శేషకుమారి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శతాబ్ద కాలంగా వినియోగదారులకు సేవలందిస్తున్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖపట్నంలోని ద్వారకానగర్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఉమెన్ బ్రాంచ్‌ని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ ఆర్.శేషకుమారి శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ప్రాధాన్యతనిస్తూ ఇటువంటి శాఖను ప్రారంభించడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సాధారణ ఆరోగ్య చిట్కాలతో సిబ్బందికి, వినియోగదారులకు మార్గనిర్దేశం చేశారు. గౌరవ అతిథిగా పాల్గొన్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ హెడ్ కె.ధరాసింగ్ నాయక్ మాట్లాడుతూ ఆల్ ఉమెన్ బ్రాంచ్ ఏర్పాటు ప్రాముఖ్యతను వివరించారు. తమ బ్యాంక్ ఎక్కువగా మెట్రో / అర్బన్ / సెమీ అర్బన్ రూరల్ ఏరియాల్లో విస్తరించి దాదాపు 4600 శాఖలతో సేవలు అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బాబ్జీ, చిత్రంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా

టీచర్ల బదిలీ అక్రమాల్లో.. బొత్సను వదిలిపెట్టేది లేదు : టిడిపి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టీచర్ల బదిలీల పేరిట కోట్ల రూపాయలు దోచేసిన మాజీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను వదిలేది లేదని, ఆయనపై కేసు పెట్టనున్నామని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలు సమయంలో ఎటువంటి బదిలీలూ చేయకూడదన్నారు. అందుకు విరుద్ధంగా బొత్స గత ప్రభుత్వ హయాంలో వ్యవహరించారని తెలిపారు. ఆయన దోపిడీదారుడని చరిత్రనే చెబుతుందన్నారు. టీచర్లను బదిలీ చేస్తామని రూ.3 నుంచి 6 లక్షలు వసూలు చేశారని, ఆ రూపంలో రూ.100 కోట్లు వరకూ కొట్టేశారని ఆరోపించారు. ఈ విషయమై టీచర్లు ఇప్పటికే చాలామంది ఫిర్యాదు చేశారని వెల్లడించారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎపి ప్రజలు కూటమికి చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా గొప్ప విజయం అందించారని ఆనందం వ్యక్తం చేశారు. గాజువాక ప్రజలు తనకు రాష్ట్రంలోనే రికార్డు స్థాయి మెజారిటీ ఇచ్చారన్నారు. టీచర్ల బదిలీ కుంభకోణంలో కీలకపాత్ర పోషించిన బొత్స సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టీచర్ల తరపున తాము కూడా పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. బొత్స టీమ్‌పై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని డిపార్టుమెంటుల్లోనూ ఈ తరహా కుంభకోణాలు జరిగాయని, వాటిపైనా దృష్టి పెడతామని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగన్‌కు ప్రజలు బుద్ధిచెప్పారు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైఎస్.జగన్మోహన్ రెడ్డి మాట ఇచ్చి మడమ తిప్పినా, ప్రజలు మాత్రం మాట తప్పకుండా ఆయన్ని గద్దె దించి తగిన విధంగా బుద్ధి చెప్పారని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ అన్నారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌ను డాబాగార్డెన్స్ సమీపంలో ఉన్న కృష్ణా గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో రామ్ కలిసి శాలువా కప్పి సత్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పుడో ఎమ్మెల్యే కావాల్సిన వంశీ పట్ల వైసిపి అవమానకరంగా వ్యవహరించి కార్పొరేటర్ పదవికి పరిమితం చేయాలని భావించిందన్నారు. మేయర్ పదవి ఇస్తామని చెప్పి మరో మోసం చేసిందన్నారు. ప్రత్యక్ష రాజకీయాలలో కొనసాగడం వంశీకి ఇష్టమైనప్పటికీ ఎమ్మెల్సీ పదవిని కేటాయించిందన్నారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ పదవి మరో నాలుగేళ్లు ఉన్నప్పటికీ వైసిపి నుంచి బయటికి వచ్చి వంశీ తన సత్తా ఏమిటో చూపించారన్నారు. ఆయన తనకు మంచి మిత్రుడని, భవిష్యత్తులో ప్రజలకు మరింతగా సేవలు అందించాలని ఆకాంక్షించారు.

'మీ సేవలు నిరుపమానం'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తనను 24 గంటలూ కంటికి రెప్పలా చూసుకున్న గన్‌మెన్ల సేవలు నిరూపమానమని వైసిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కొనియాడారు. శుక్రవారం తన కార్యాలయంలో గన్‌మెన్లు ఎ.అప్పలనాయుడు, జి.బులినాయుడులను వాసుపల్లి ఘనంగా సత్కరించారు. మిఠాయిలు తినిపించారు. వారు కూడా వాసుపల్లి భవిష్యత్తులో మరిన్ని శిఖరాలు అధిరోహించాలని కోరుకున్నారు. వాసుపల్లి గణేష్ కుమార్‌ను వీడి వెళ్లడం పట్ల కన్నీటి పర్యంతమయ్యారు.